వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో వైద్య రంగానికి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి జన్మదినం పురస్కరించుకొని సోమవారం స్వర హాస్పిటల్ సౌజన్యంతో వస్త్రలత ప్రాంగణంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వెలంపల్లి హాజరయ్యారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, స్థానిక కార్పొరేటర్ మండేపూడి చటర్జీ ప్రారంభించారు. వెలంపల్లి మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా స్వర హాస్పిటల్ సౌజన్యంతో వస్త్రలత కమిటీ మెడికల్ క్యాంపు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. పేదలకు మంచి వైద్యం అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గంలో పలు ప్రభుత్వ ఆసుపత్రులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధర రావు, అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొండపల్లి బుజ్జి, మార్కెట్ కమిటీ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఓం బాన్‌క్విట్స్ ఆధ్వర్యాన నిర్వహించిన వేషధారణ పోటీలో చిన్నారులు ధరించిన దుస్తులు ఆహూతులను అలరించాయి. జాతీయ పతాకంలోని మూడు రంగులతో కూడిన చీరెను బాలిక ధరించగా, త్రివర్ణ పతాకాన్ని చేబూని మరొకరు, గాంధీ, లాయర్, గోపిక, వివేకానందుడు, సుభాష్ చంద్రబోస్ వంటి పలు వేషధారణల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథి అరుణాచలేశ్వర స్వామి ఆర్య వైశ్య అన్నదాన సత్రం వైస్ ప్రెసిడెంట్ మద్దాల శ్రీనివాస్ కుమార్ విచిత్ర వేషధారణ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని రగిలిస్తూ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో గుర్రం చిన్న నాగ ఉదయ్ శంకర్, పేర్ల వెంకట సాయి కృష్ణ, డాక్టర్ గుర్రం వెంకట సుబ్బారావు, గుర్రం ఈశ్వర్ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పరిష్కరించండి



పటమట(విజయవాడతూర్పు): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం జరిగిన స్పందనలో మొత్తం 19 ఫిర్యాదులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగం-9, ఇంజినీరింగ్ విభాగం-2, రెవెన్యూ-1, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి)-6 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్(జనరల్), యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్య మైదానంలో నిర్మాణం జరుపుకుంటున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం స్మృతి వనం పనులను సోమవారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్ అధికారులతో కలిసి పరిశీలిచారు. సుందరీకరణ పనులను ఎక్కడెక్కడ ప్రారంభించాలో పరిశీలించి అధికారులకు సూచించారు. హరితహారంలో మొఘల్ గార్డెన్ ల్యాండ్ స్కేపింగ్ భాగాలు, వెదురు ఫ్రేమ్ లో బౌగెన్విలేయా మొక్కలు, గులకరాయి నమూనాలు, జాతీయ పక్షి నెమలి ఆకృతిని అందంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అంబేద్కర్ చూపుడువేలును అత్యంత జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యటనలో ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనిల్ కుమార్, మేనేజర్ కె. కృష్ణ మోహన్, తదితరులు ఉన్నారు

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్య కనిపించడం లేదంటూ భర్త కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 204కు చెందిన సింధి ఏసుపాదం, పార్వతి భార్యభర్తలు. వీరికి ఐదుగురు సంతానం. భార్యభర్తలిద్దరు రైళ్లలో ఇయర్ ఫోన్స్, ఇతర సామగ్రి అమ్ముతుంటారు. ఈ నెల 9వ తేదీన ఏసుపాదం వ్యాపారం కోసం బయటకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో భార్య కనిపించకపోవడంతో పిల్లలను అడగగా, బయటకు వెళ్లిందని చెప్పారు. పార్వతి ఇంటికి రాకపోవడంతో తెలిసిన వారు, స్నేహితులను అడిగినా ఫలితం లేదు. తన భార్య కనిపించడం లేదంటూ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కాశీ విశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో సోమవారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన మాసశివరాత్రి పూజలు ఘనంగా జరిగాయి. నీలకంఠేశ్వర స్వామికి అర్చకులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామికి ప్రీతికరమైన మాస శివరాత్రి, సోమవారం కలిసి రావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.





ఆపన్నహస్తం

- పేదలకు అండగా వెలంపల్లి ఫౌండేషన్
- సేవలందిస్తున్న డాక్టర్ సాయిఅశ్విత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పేదలకు అండగా నిలుస్తోంది నగరంలోని వెలంపల్లి ఫౌండేషన్. పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కుమార్తె డాక్టర్ సాయిఅశ్విత ఫౌండేషన్ చైర్మన్‌గా పేదలకు ఆపన్నహస్తం అందిస్తున్నారు. నియోజకవర్గంలో అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న వారికి ఫౌండేషన్ సాయం చేస్తోంది. ప్రజల ఆర్థిక ఇబ్బందులకు, ఇతర వైద్య సేవలు చేయడానికి ఫౌండేషన్ నుంచి ఆయన కుమార్తె సాయిఅశ్విత ముందుకు వస్తున్నారు. నియోజకవర్గంలోని మసీదులు, చర్చిలు, ఆలయాల నిర్మాణానికి, అభివృద్ధికి ఫౌండేషన్ తరఫున ఆమె అండగా నిలుస్తోంది.


ఫౌండేషన్ నిధులతో షాదీఖానా ప్రహరీ పనులను ప్రారంభిస్తున్న సాయిఅశ్విత

నాలుగేళ్లలో రెండు కోట్ల మేర సాయం

వెలంపల్లి ఫౌండేషన్ గడిచిన నాలుగేళ్లలో రెండు కోట్ల రూపాయల విలువైన సాయమందించినట్లు ఆ సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు. నగరంలోని వివిధ వరాలు, సంస్థలకు అవసరమైన సాయాన్ని అందిస్తున్నారు. దుర్గాఘాట్‌లో కర్మల షెడ్‌ను ఏర్పాటు చేసి బ్రాహ్మణులకు సాయమందించారు. ఎర్రకట్ట దిగువన కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేశారు. వందలాది మందికి తోపుడు బళ్లను ఉచితంగా అందించి వారి జీవనోపాధికి అండగా నిలిచారు. తండ్రి వెలంపల్లి శ్రీనివాసరావు బాటలోనే నడుస్తున్నానని సాయిఅశ్విత తెలిపారు. కులమతాలకతీతంగా సేవలందిస్తున్నామని వీటిని విస్తృత పరుస్తామని ఆమె పేర్కొన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం మిన్న

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పుట్టినరోజు పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు షేక్ నాగుల్ మీరా ఆధ్వర్యంలో భవానీపురంలోని పున్నమి ఘాట్ సమీపంలో ఫ్లై ఓవర్ కింద సోమవారం అన్నదానం చేశారు. ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షులు షేక్ గౌస్ మొహిద్దీన్, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని వడ్డించారు. వారు మాట్లాడుతూ అన్ని దానాల్లో అన్నదానం మిన్న అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పోలిమెట్ల శరత్ బాబు, గంగవరపు మురళి, అంకాని నాగరాజు, బూదాల శ్రీను, బొట్ల శ్రీను, మంచాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ స్టేట్ జనరల్ సెక్రటరీ జోసఫ్ శివమణి ఆధ్వర్యాన భవానీపురం అవుట్ ఏజెన్సీలో వద్ద సీఎస్ఐ ఎలిమెంటరీ స్కూల్‌లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, కార్పొరేటర్లు ఇర్ఫాన్, రాజేష్ పాల్గొన్నారు.

వీఎంసీలో ‘నా భూమి-నా దేశం’

పటమట(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ‘మేరీ మిట్టి మేరీ దేశ్ బోలో’ (నా భూమి-నా దేశం) లో భాగంగా మట్టి కలశాన్ని నగరపాలక సంస్థ కార్యాలయం కాంపౌండ్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద ఏర్పాటు చేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు అందులో మట్టిని వేశారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు ఐదు రోజుల పాటు కార్యక్రమం జరుగుతుందని, వీఎంసీ కార్పొరేటర్లు, ఎక్స్-అఫీషియో సభ్యులు ఇందులో మట్టి వేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం. ప్రభాకర్, ఈఈ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



























● నేడు కబేళా, చేపల మార్కెట్లు, మాంసపు దుకాణాలకు సెలవు

పటమట(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలోని కబేళాకు సెలవు ప్రకటించామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి నుంచి కబేళాలో జంతువులను వధించటం నిషేధించామని నగరంలో ఉన్న అన్ని చికెన్ షాపులు, మటన్ షాపులు, చేపల మార్కెట్లకు సెలవు అని పేర్కొన్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి



సంగీత కళాశాల నుంచి ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు

విజయవాడ కల్చరల్: అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని సంగీత కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి అన్నారు. సంగీత కళాశాల, ఏపీ భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం, ఆజాదీకా అమృత మహోత్సం, నామట్టి నాదేశం కార్యక్రమంలో భాగంగా శోభా యాత్ర నిర్వహించారు. దుర్గాపురంలోని సంగీత కళాశాలలో సోమవారం యాత్రను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నేడు స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నామంటే ఎందరో పోరాట యోధులు ఆత్మబలి దానంతోనే సాధ్యమైందన్నారు. సంగీత కళాశాలలకు చెందిన ఏడువందలమంది విద్యార్థులు జాతీయ జెండాను పట్టుకొని దేశ భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం బీఆర్టీఎస్ రోడ్డు మీద శోభాయాత్ర చేశారు. కార్యక్రమంలో సంగీత కళాశాల అధ్యాపకులు కందుల లక్ష్మి, అంపోలు శోభాలక్ష్మి, మల్లాది కార్తీక త్రివేణి, ఎం.మాధురి, తదితరులు పాల్గొన్నారు.

● జెండా పండుగకు ముస్తాబు



స్వాతంత్ర్య దిన వేడుకలకు సర్వం సిద్ధమైంది. మంగళవారం రాష్ట్ర స్థాయిలో నిర్వహించే వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. జాతీయ పతాకాలతో ఇందిరా గాంధీ స్టేడియాన్ని ముస్తాబు చేశారు. ప్రభుత్వ పథకాలను తెలిపే శకటాలు సిద్ధమయ్యాయి. స్థానిక రహదారులను విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

–సాక్షిఫొటోగ్రాఫర్, విజయవాడ

పూర్తి సమాచారం తెలపండి



టికెట్ల కౌంటర్‌ను తనిఖీ చేస్తున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గ గుడికి సంబంధించి భక్తులు అడిగే పూర్తి సమాచారాన్ని వారికి తెలియజేయాలని ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు సోమవారం కనకదుర్గనగర్, మహామండపంలోని టికెట్లు, ఆర్జిత సేవా కేంద్రం, టోల్‌ఫ్రీ కౌంటర్లను పరిశీలించారు. కనకదుర్గనగర్ నుంచి మహా మండపం వరకు భక్తులు నడిచే మార్గంలో పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించాలని, రోడ్డుకు ఇరువైపులా భక్తులు వదిలేసిన చెప్పులను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ఈఈ రమాతో కలిసి గోశాల, మహా మండపం ప్రాంతాలను పరిశీలించారు. రూ.500 టికెట్లు విక్రయించే కౌంటర్‌ను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. టోల్‌ఫ్రీ నెంబర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి తనకు, ఈవోకు తెలియజేయాలని ఆదేశించారు. భక్తులకు ఉచితంగా లభించే వీల్‌ఛైర్‌లపై ఆరా తీశారు. దళారులకు వీల్‌ఛైర్లు ఇవ్వొద్దని ఆదేశించారు.

విద్యతో ఉన్నత శిఖరాలకు.. : డీఈఓ రేణుక

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అన్నారు. ఆమె సోమవారం భవానీపురంలోని ఎస్ఎంఎ ఖుద్దూస్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌తో పాటు ఎలిమెంటరీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు నోట్ బుక్‌లను పరిశీలించిన అనంతరం సబ్జెక్టులవారీగా వారిని ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల సామర్థ్యాలను విశ్లేషించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించి వారి తప్పులను సరిదిద్దారు. ఐఎఫ్‌పీ టాబ్లెట్స్ గురించి ఆరా తీశారు. రక్తహీనత ఉన్న విద్యార్థులకు రోజూ టాబ్లెట్స్ వేస్తున్నారో లేదో పరీక్షించారు. స్కూల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరీక్షించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె ఉమర్ అలీ, ఎలిమెంటరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు శివ ప్రసాద్ నాయక్ పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన అజయ్ పాండే దినేష్(35) టైలర్. కరోనా సమయంలో అప్పులు చేశాడు. ఇటీవల బైక్ కొనుగోలు చేయగా, ఈఎంఐలు సక్రమంగా కట్టకపోవడంతో కంపెనీ వారు బైక్‌ను తీసుకొని వెళ్లిపోయారు. అతను ఇబ్బందులు పడుతుండటంతో తల్లి షీలా పాండే బ్యాంక్‌లో లోన్ తీసుకునేందుకు బ్యాంక్‌కు వెళ్లగా, దినేష్ భార్య పనికి, పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. దీంతో ఇంట్లో ఉన్న దినేష్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వివరాలను తెలుసుకుని కేసు నమోదు చేశారు.

నీలకంఠేశ్వరస్వామికి అన్నాభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో సోమవారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన మాసశివరాత్రి పూజలు ఘనంగా జరిగాయి. నీలకంఠేశ్వర స్వామికి అర్చకులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామికి ప్రీతికరమైన మాస శివరాత్రి, సోమవారం కలిసి రావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.